




పంట మార్పిడి విధానంతో రైతులకు లాభాలు

కురవి, సెప్టెంబరు 16 : రైతులు పంట మార్పిడి పద్దతిని అవలంభించి అయిల్‌పామ్ సాగు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న సూచించారు. కురవి, సీరోలు, మరిపెడ, మహబూబాబాద్ మండలాల్లోని పలు గ్రామాలను ఆయన సోమవారం సందర్శించి రైతుల తో మాట్లాడారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న అయిల్‌పామ్, పండ్ల తోటలు, పూల తోటలు, మల్బరీ, కూరగాయలు మొదలగు వాటిని అంతర్ పంటలుగా సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు మేలైన యాజమాన్య పద్దతులు పాటించాలని, సేంద్రియ వ్యవసాయం చేసి నాణ్యమైన దిగుబడులు పొందాలన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతీ ఎకరాకు రూ.లక్ష వరకు రాయితీలు పొందేందుకు అయిల్‌పామ్ సాగు చక్కని అవకాశమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కరుణాకర్, కిశోర్, అగస్టిన్, నాగరాజు పాల్గొన్నారు.



మహబూబాబాద్ నిజాం చెరువు వద్ద వినాయక నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మహబూబాబాద్ నిజాం చెరువులో నిమజ్జనం చేస్తున్న వినాయక విగ్రహం



మహబూబాబాద్‌లో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళ్తున్న వినాయక విగ్రహాలు

బై బై గణేశా..

వైభవంగా నిమజ్జనోత్సవం

- డీజేలతో దద్దరిల్లిన మానుకోట జిల్లా
- ఘనంగా శోభాయాత్రలు..
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం వినాయక నిమజ్జన వేడుకలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ నెల 7న వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించారు. తొమ్మిదిరోజుల పాటు భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు రోజున జిల్లా వ్యాప్తంగా గణనాథులను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నిజాం చెరువులో మునిసిపాలిటీ పరిధిలోని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఫారెస్టు సెంటర్‌లోని ఆహ్వాన వేదిక వద్ద వినాయక విగ్రహాలకు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి నారీకేళాలు సమర్పించగా విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ నిజాం చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించి పోలీస్ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొని పూజలు చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని మరిపెడ మండలం తానంచెర్లలో మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో భక్తి శ్రద్దలతో వినాయక నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేశారు. చిన్నారులు, యువతీయువకులు, మహిళలు నిమజ్జన ర్యాలీల్లో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. జిల్లా వ్యాప్తంగా ర్యాలీల్లో గణపతిపప్ప మోరియా అంటూ కేరింతలు కొడుతూ.. చెరువుల వద్దకు విగ్రహాలను తరలించి బై..బై గణేశా అంటూ నిమజ్జనం చేశారు.



తొర్రూరులో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కురవిలో నిమజ్జనం కోసం తీసుకువెళ్తున్న కురవి వీరభద్రస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం



మహబూబాబాద్ న్యూ హౌజింగ్ బోర్డుకాలనీ వినాయక విగ్రహం వద్ద వేలంపాటలో లడ్డూను రూ. 91,116లకు దక్కించుకున్న వేల్పుల వెంకటేశ్వర్లు-కనకదార దంపతులు



మరిపెడ మండలం తానంచెర్లలో వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్



మహబూబాబాద్ వినాయక నిమజ్జనంలో మహిళలతో కలిసి కోలాటం వేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సతీమణి ఉమ



కురవిలో నిమజ్జనం కోసం తీసుకువెళ్తున్న బస్టాండ్ సెంటర్‌లోని వినాయక విగ్రహం



మహబూబాబాద్ నిజాం చెరువు వద్ద నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్



మహబూబాబాద్‌లో నిమజ్జనం చేసేందుకు వాహనంలో తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం



నర్సింహులపేట మండల కేంద్రంలో నిమజ్జనానికి తీసుకు వెళ్తున్న విగ్రహం



గూడూరు మండలం అయోధ్యపురం పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి రవీందర్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి రవీందర్

గూడూరు, సెప్టెంబరు 16 : వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి రవీందర్ అన్నారు. మండలంలోని అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అయోధ్యపురం పీహెచ్‌సీకి భవన సౌకర్యం లేదని, వైద్యాధికారులు యమున అధికారుల దృష్టికి తీసుకెళ్లగా భవనం మంజూరు అయిందని, త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. సీజనల్ వ్యాధులపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రాపిడ్ ఫీవర్ సర్వే, వైద్య శిబిరాలు నిర్వహించాలని, జాతీయ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీ సాధించిన ప్రగతి కార్యక్రమాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి రవీందర్, డీఎంహెచ్‌వో మురళీదర్‌లను, వైద్య సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ యమున, డాక్టర్ శివ, డాక్టర్ మురళి, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది లవారం, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

- కేసముద్రం: కేసముద్రం పీహెచ్‌సీని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా వైద్యాధికారి మురళీదర్, జిల్లా ఉపవైద్యాధికారి ప్రమీళ, ప్రోగ్రాం ఆఫీసర్‌లు సుధీర్ రెడ్డి, నాగేశ్వర్‌రావు, సారంగం, లక్ష్మీనారాయణ, జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు సన్మానించారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేయనున్న ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్ నాయక్





ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు సిద్ధమైన సభావేదిక

మహబూబాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ హాజరై జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 9.58 గంటలకు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ గౌరవ ముఖ్య అతిథి, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్‌ను స్వాగతించనున్నారు. 10 గంటలకు ముఖ్య అతిథి జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. 10.01 గంటలకు జాతీయ గీతాలాపన, 10.02 గంటలకు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాలాపన, 10.07 గంటలకు పోలీసులచే గౌరవ వందనం స్వీకరణ, 10.10 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం, అనంతరం 10.15 గంటలకు జాతీయ గీతాలాపనతో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాలు ముగియనున్నాయి.

ఉద్యమకారులను అక్కున చేర్చుకోవాలి

- వారి కోసం సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలి
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



మహబూబాబాద్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16: తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం అక్కున చేర్చుకుని వారి కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఫోరం చేపట్టిన బస్సు యాత్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి సోమవారం మానుకోట జిల్లాకు చేరుకుంది.

స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు 250 గజాల స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులంతా కాంగ్రెస్ పక్షాన నిలబడి వారిని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని అలాంటి వారి గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 27 హైదరాబాద్‌లోని హరిహరకళా క్షేత్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆరవ ఆవిర్భావ సభను నిర్వహిస్తున్నామని దీనికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్‌ను ఆహ్వానించామని ఈ సభకు ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇక్కడ నుంచి నర్సంపేటకు బయలుదేరి వెళ్లారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నేతలు పోతు జ్యోతి, సురేందర్ రెడ్డి, శ్యామల, దయానంద్, భాస్కర్, జగన్, ధరంసోత్ నారాయణసింగ్, బొర్రాజు లింగన్న, గంగుల శ్రీనివాస్, గుంజె హన్మంతు, పోల్‌రాజ్, అమ్మాద్‌ఖాన్, నయీం పాల్గొన్నారు.

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం..

- 'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
- నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన యోధులెందరో..

నేడు తెలంగాణ విమోచన దినం

"బండెనక బండికట్టి.. పదహారు బండ్లు కట్టి
ఏ బండ్లె పోతవు కొడుకో.. నైజాం సర్కరోడా
చుట్టుముట్టూ సూర్యాపేట.. నట్టనడుమ నల్లగొండ
నువ్వుండేది హైదరాబాద్.. దాని పక్క గోలుకొండ
గోలుకొండ ఖిలా కింద.. నీ ఘోరీ కడతం కొడుకో.. నైజాము సర్కరోడా.."

అంటూ తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డారు. రజాకార్లు, పోలీసులు అణిచివేసినా.. భూస్వాములు, జమిందారులు, తాబేదార్లు ఆ నిజాం రాచరికానికి బాసటగా నిలిచినా.. బానిస బంధనాల నుంచి విముక్తి కోసం.. భూమికోసం, భుక్తికోసం కొట్లాడారు. ఓ వైపు జాతీయజెండాలు.. మరోవైపు ఆయుధాలు చేత బట్టిన ఎందరో యోధులు అవిశ్రాంత పోరాటం చేశారు. వారిలో కొందరు ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు చేశారు. నాడు ఉవ్వెత్తున సాగిన విమోచన సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాత్ర కీలకం. విమోచన ఉద్యమచరిత్రలో ఓరుగల్లు తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. ఈ పోరుబాటలో ఎందరో యోధుల గళం.. విముక్తి గీతంలా ప్రతిధ్వనించగా.. బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల తదితర గ్రామాల్లో రజాకార్లు చేసిన మారణకాండ విప్లవ స్ఫూర్తిని రగిల్చింది. చివరకు యోధులు, ప్రజల పోరాటానికి నిజాం సర్కారు తలవంచింది. 1948 సెప్టెంబరు 17న తెలంగాణకు విముక్తి లభించింది.



ప్రత్యేక కథనాలు 7వ పేజీలో..



ఏజెన్సీలో వినూత్నం

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల ఏర్పాటు



గతంలో పాఠశాలను నిర్వహించింది ఈ పాకలోనే..

ఏటూరునాగారం రూరల్/కన్నాయిగూడెం, సెప్టెంబరు 16: వినూత్న ప్రయోగానికి ఏజెన్సీ నిలయమైంది. ఏళ్ల తరబడి పూరి గుడిసెలో సాగిన చదువులకు గ్రహణం వీడింది. అటవీ పల్లెలో విద్యాబోధన కోసం ఓ కంటైనర్ సిద్ధమైంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి మారుమూల అటవీ ప్రాంతంలోని బంగారుపల్లి గ్రామంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడం వల్ల కలెక్టర్ ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఈ కంటైనర్ పాఠశాలను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించనున్నారు.

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి 18 కిలోమీటర్ల దూరంలోని కన్నాయిగూడెం మండలం మండలం కంతనపల్లి సమీప అటవీ ప్రాంతానికి ఛత్తీస్‌గఢ్ నుంచి 2000లో గొత్తికోయలు వలస వచ్చి ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం వీరి పిల్లల చదువుల కోసం 2010లో ఇక్కడ ఓపాకలో పాఠశాల ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ దానికి శాశ్వత నిర్మాణం జరగలేదు. పక్కా భవనం నిర్మించేందుకు అటవీ శాఖ అనుమతు లను నిరాకరిస్తోంది. దీంతో గొత్తికోయ పిల్లలు ఏళ్లతరబడి అదే పాకలో అష్టాకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. మొత్తం 35 మంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకుం టున్నారు.

రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల

పాఠశాల శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఇక్కడ కంటైనర్ (ప్రీఫ్యాబ్రికేటెడ్ హౌజ్)ను ఏర్పాటు చేయాలని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర్ నిర్ణయించారు. ఇందుకు రూ. 13 లక్షలు వెచ్చించారు. ఈనెల 11న పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపాదికన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పుడా పాఠశాల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మొత్తం ఐదు తరగతులకు 35 మంది విద్యార్థుల కోసం 12 డ్యూయెల్ డెస్కులు ఇందులో ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అనుమతుల నిరాకరణ నేపథ్యంలో రెండు ననెలల క్రితం తాడ్వాయి మండలంలో మొట్టమొదటి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయగా, ఇప్పుడు అదే తరహాలో కన్నాయిగూడెం మండలం కంతనపల్లిలో పాఠశాలను ప్రారంభించనున్నారు. మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ఈ పాఠశాల ప్రారంభం కానుంది. దీనిపై గొత్తికోయవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చాలా ఆనందంగా ఉంది: పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రాచారి

ఈ పాఠశాలకు 2022లో ప్రధానోపాధ్యాయుడిగా చేరాను. అప్పటి నుంచి పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేశాను. కొని కారణాల వల్ల పాఠశాల భవనానికి పునాది పడలేదు. కానీ కలెక్టర్ చొరవతో ప్రీఫ్యాబ్రికెటెడ్ కంటైనర్ పాఠశాల సిద్ధం కావడం ఆనందంగా ఉంది. కంటైనర్ పాఠశాల నిర్మాణంతో విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా కంటైనర్ పాఠశాల లోపలి దృశ్యం





















బై..బై.. గణేశా..

వరంగల్ నగరంలో ప్రశాంతంగా జరిగిన వినాయక నిమజ్జనం



కాజీపేట బంధం చెరువులో క్రేన్ సహాయంతో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది


చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం అవుతున్న గణపతులు


చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద సైకిల్ రిక్షాపై వెలుతూ..


చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జనానికి కారుపై..


కాజీపేట బంధం చెరువు వద్ద బైక్‌పై వెలుతూ..




చిట్టి గణపతులను ఎత్తుకుని నిమజ్జనానికి తరలిస్తున్న యువతులు, చిన్నారి




వేయిస్తంభాల గుడి కోనేరులో నిమజ్జన దృశ్యం


వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద సిద్ధంగా ఉన్న రెస్క్యూ సిబ్బంది


ఆంధ్రజ్యోతి మడికొండ యూనిట్ ఆఫీసులో సిబ్బంది నిమజ్జన సంబురం


వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనంలో కలెక్టర్ సత్య శారద

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం..

'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్రభాగాన నిలిచింది. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసుల అణిచివేసినా.. భూస్వామ్య జమిందారి వర్గం, తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ఎంతో మంది యోధులు ఎదురొడ్డారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఆయుధాలు చేత బట్టి.. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ ఉద్యమంలో వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచి.. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. కాకతీయులు ఏలినగడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ నిలిచారు. అంతేకాదు బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల ఇలా ఎన్నో గ్రామాల్లో రజాకార్ల విధ్వంసకాండ నేటికీ గుర్తుండిపోయింది. ఈ నేపథ్యంలో రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి అయిలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారిమడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు. నాడు నిజాంల అండతో రజాకార్లు విధ్వంసాలు, అకృత్యాలకు పాల్పడుతున్న వేళ ప్రజలు కొందరు పొరుగురాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. నాడు పోరాట వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర), గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో సరిహద్దు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కొక్కరు నాయత్వం వహించారు. విజయవాడలోని శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడవగా ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలను రాత్రివేళల్లో గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది. ఈ విధ్వంస రచనను గమనించిన కేంద్ర ప్రభుత్వం రజాకార్ల అరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించి 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. ఆ సమయంలో చేపట్టిన ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో వరంగల్ మామునూరు విమనాశ్రయం ఎంతగానో దోహదపడింది. విమానాల ద్వారా సైన్యం ఇక్కడికి చేరుకుని రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేసింది. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ తలవంచడంతో నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది.

పరకాల మారణ హోమం

విమోచన సంగ్రామంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకాకేంద్రం అయిన పరకాల సమీపంలోని పైడిపెల్లి తాటివనంలో ఉద్యమనాయకులు సమావేశం నిర్వహించగా ప్రజలు భారీగా తరలివచ్చారు. కానీ అప్పటికే ఒకవైపు పోలీసులు, మరోవైపు రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని విరమించుకోవలని పోలీసులు సూచించినా ప్రజలు వినలేదు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలతో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నేతృత్వంలో పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. దీన్ని అదనుగా చేసుకున్న రజాకార్లు కూడా తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అనేక మంది ప్రాణాలు విడిచారు. ఎంతోమంది కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలు, రక్తపుటేరులతో ఆ ప్రదేశమంతా భయంకరంగా.. మరో జలియన్‌వాలా భాగ్‌ను తలపింపజేసింది.

బైరాన్‌పల్లి బీభత్సం

నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను బైరాన్‌పల్లి గ్రామస్థులంతా ఐక్యతతో ఎదురించారు. ఈ పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్లా నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర యోధులు నాయకత్వం వహించారు. ఓ రోజున రజాకార్లు దూలిమిట్ట, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లపై తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదురించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. ఆ కక్షతో కూటిగల్ గ్రామంలో 20మందిని కాల్చి చంపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 12రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టి.. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులపై కాల్పులు జరిపారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు వైపు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించాయి. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టిన నిర్ధాక్షిణ్యంగా కాల్చిచంపారు రజాకార్లు. ఆ తదనంతర కాలంలో రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను చాకలి అయిలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. ఐలమ్మ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆనేకచోట్ల పోరాటయోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. తొర్రూరులో పోలీసుక్యాంపుపై దాడిచేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారిమడూర్‌కు చెందిన అనేక మంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లీపురం గ్రామాన్ని తగులబెట్టారు. వీటికి ప్రతిగా పోరాటయోధులు ఆయా ప్రాంతాల్లో రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.


పరకాలలోని అమరధామం

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్టగా నిలుస్తుంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొనేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగురువేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదరించే క్రమంలో మొగిలయ్య వారి కత్తిపోట్లకు గురై నేలకొరిగాడు.

రక్తమోడిన తమ్మడపల్లి(జి)


జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి)లో అమరుల స్మారక స్థూపం


ఆయుధం పట్టిన కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (అచ్చమాంబ)

జఫర్‌గడ్, సెప్టెంబరు 16: తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని నిజాం అనుచరుడైన రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీదారుల ఆగడాలను అడ్డుకునేందుకు ప్రజలు రక్షకదళాలను ఏర్పరచుకుని రాళ్లు, కర్రలు, వడిశాలలు, బర్సీలు, కత్తులు లాంటి సంప్రదాయ ఆయుధాలతో పోరుబాటలో నడిచారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, పంబాల రాఘవరావు, ఎలమంద, తదితరులు సంచరిస్తూ ఈ రక్షకదళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు. సాయుధ పోరులో భాగం గా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్రమహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో రజాకార్ల ముఠాపై ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. కొద్దిరోజులకు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12 మందిపై గ్రామ కూడలిలో నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్న నర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహరామయ్య, కుంట పెద్దాపురం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, పశువుల కొట్టాన్ని, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామస్థులకు పంపిణీ చేశారు.

ఆయుధం పట్టిన అచ్చమాంబ

జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్ రావుతో కలిసి సాయుధ పోరాటంలో ఆయుధం పట్టి నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14ఏళ్ల వయసులోనే నిజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో ఏర్పడిన పరిచయంతో వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం. ప్రస్తుతం భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం వరంగల్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు.

ఆగడాలకు ప్రత్యక్ష సాక్షి..

84ఏళ్లయినా చెక్కుచెదరని విస్నూరు గడి



పాలకుర్తి, సెప్టెంబరు 16 : నిజాం నవాబుకు ప్రధాన అనుచరుడైన విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి తన కోసం ఓ గడీని నిర్మించుకున్నారు. ఆ గడి పేరు చెబితే చాలు ఈ ప్రాంత వాసులు గడ గడలాడే వారు. నాడు సుమారు 60 గ్రామాల ప్రజలతో వెట్టి చాకిరీ చేయించి ఈ గడిని నిర్మించారు. ఇది జరిగి 84 ఏళ్లయినా ఆ గడీ ఇంకా చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది. కానీ నిజాం, దేశ్‌ముఖ్, రజాకార్ల ఆగడాలు, దమన కాండకు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చేసిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీలు విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ఎదురొడ్డి చేసిన పోరాటాలకు ఈ గడీ ప్రత్యక్షసాక్షిగా నిలిచింది.

నెహ్రూ ఇంటి తరహాలోనే నిర్మాణం

అలహాబాద్‌లోని అప్పటి ప్రధాని నెహ్రూ ఇంటి నిర్మాణం తర్వాత మరెక్కడా లేని విధంగా ఈ భవనం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించారు. గడి నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60 గ్రామాల ప్రజల నుంచి రజాకార్లను పంపించి బలవంతంగా వసూళ్లు చేసిన రూ.2లక్షలను ఈ గడి కోసం ఖర్చు చేశారు. ఐదున్నరక ఎకరాల్లో బ్రిటీష్ సివిల్ ఇంజనీరు ప్లాన్‌తోనే నిర్మాణం జరగ్గా.. అప్పటి కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి వల్లూరి బసవరాజు పర్యవేక్షణలో ఈ నిర్మాణం పూర్తి చేశారు. 20 గజాలలోతు, 3గజాల వెడల్పుతో పునాదులు తవ్వి అప్పుడు ఊరిన నీటిని ఆయిల్ ఇంజన్‌లతో బయటికి తోడించి సున్నం, కంకరను పునాదుల్లో పోసి దిమ్మిసలతో అదిమి, పకడ్బందీగా నిర్మించారు. 2 గజాల వెడల్పు, 5 గజాల లోతులో ఐదున్నర ఎకరాల్లో ప్రహరీ నిర్మించారు. రంగూన్ నుంచి బర్మా టేకును, స్విడ్జర్లాండ్ నుంచి జర్మన్ టెక్నాలజీ విద్యుత్ స్విచ్ బోర్డులు తెప్పించారు. ఇక మరుగుదొడ్ల నీరు బయటకు వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరం అండర్ గ్రౌండ్ కాలువను నిర్మించారు. తుపాకుల తూటాలు గోడలోకి దూసుకుపోకుండా సీసం, పాచి తీగ, కోడిగుడ్లను దంగు సున్నంలో కలిపి గడి గోడలు కట్టారు. 1943లో గృహప్రవేశ కార్యక్రమం జరగ్గా నిజాంనవాబు హాజరై దేశ్‌ముఖ్‌కు ధనరాశులను బహుమతిగా అందించారు. అలాగే విస్నూరులో దేశ్‌ముఖ్‌కు రక్షణగా 1937లో తొలి పోలీస్ ఠాణాను నిర్మించగా.. రెండోది రంగారెడ్డి జిల్లాలో నిర్మించారు. 84 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ముస్నూరు గడి చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది.


విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి (ఫైల్)

'కాటారం' వీరులెందరో..

కాటారం, సెప్టెంబరు 16: తెలంగాణ విముక్తి పోరులో భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ (పూర్వ కరీంనగర్‌జిల్లా) వాసులెందరో వీరోచితంగా పోరాడారు. దామెరకుంట, మహదేవపూర్, మంథని ప్రాంతాలకు చెందిన యోధులు త్యాగాలు చేశారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నాయకత్వం వహించగా, రఘునాథ్‌కాచే జిల్లాలో తొలి సత్యాగ్రహవాదిగా కీలక భూమిక పోషించారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నేతృత్వంలో దామెరకుంట, మహదేవ్‌పూర్, మంథనికి చెందిన వెంకటయ్య, చిన్న పోచిరెడ్డి, కొడిపెల్లి వెంకటయ్య, బక్క రాజయ్య, రాజిరెడ్డి, కిషన్‌రావు, ప్రభాకర్, చంటయ్య, రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్, శివనాద్రి శంకరయ్య, నరహరి, సీతారాం తదితరులు సాయుధ పోరాటం చేశారు. స్వామి రామానందతీర్థ పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమంలో రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో గణపతి, రాజేశ్వర్‌రావు, రాజన్నచారి సహా పలువురు పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా పోరాడి కరీంనగర్, నిజామాబాద్ జైళ్లలో శిక్షను అనుభవించారు. దామెరకుంటకు చెందిన ఐత చిన్నపోచిరెడ్డిని రజాకార్ల సైన్యం ధన్వాడ వద్ద చంపడం విషాదాన్ని నింపింది. శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్(చాందా)లో సాయుధ శిక్షణ పొంది, గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా క్యాంపును ఏర్పాటు చేసుకుంది. అజ్ఞాతంలో ఉంటూ మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాం పోలీసు అధికారులపై గెరిల్లా దాడులు చేశారు. 1948లో గోదావరినది దాటి నిజాం సర్కార్ దామెరకుంట, కాళేశ్వరం, మహదేవపూర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్లపై దాడి చేశారు. దామెరకుంటలో కలెక్టర్ పర్యటన సందర్భంగా తహసీల్ అధికారులపై దాడి చేసి చంపిన సంఘటన సంచలనం రేపింది. ఈ దాడుల స్ఫూర్తితో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు.


సిల్వర్ జూబ్లీ స్వాతంత్ర్యానికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

ఎందరో యోధుల స్ఫూర్తి

బందగీ పోరాటం చిరస్మరణీయం


కామారెడ్డిగూడెంలోని షేక్‌బందగీ సమాధి

దేవరుప్పుల, సెప్టెంబరు 16: నాటి నల్లగొండ జిల్లా జనగామ ప్రాంత విస్నూరు దేశ్‌ముఖ్ అయిన రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలు, అకృత్యాలకు ఎదురొడ్డి పోరాడిన దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య తొలి వీర మరణం పొంది చరిత్రకెక్కాడు. అంతేకాదు దేవరుప్పుల, ధర్మాపురం, కోలుకొండ, కడవెండి గ్రామాల్లోనే దాదాపు 40మంది విస్నూర్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా, నైజాం విముక్తిపోరులో పోరుసల్పి అసువులు బాశారు. గుండెనె ఉద్యమ జెండాగా చేసి పోరాడిన వారిలో దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంకు చెందిన షేక్‌బందగీ ఒకరు. విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి ఆదీనంలో ఉన్న గ్రామాల్లో ఆయన చెప్పిందే వేదం. షేక్‌బందగీ అన్న అబ్బాస్‌అలీ విస్నూర్ దేశ్‌ముఖ్‌కు ముఖ్య అనుచరుడు. అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఏర్పడగా.. అబ్బాస్‌అలీకి ఎక్కువ భూమి ఇవ్వాలని విస్నూరు దొర తీర్పుచెప్పారు. దానిని అంగీకరించని బందగీ వాగ్వాదానికి దిగడంతో దొర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయినా తగ్గని బందగీ కోర్టుకు వెళ్లాడు. ఆ సమయంలో దొర ఎన్ని ప్రయత్నాలు చేసినా బందగీనే విజయం సాధించాడు. ఇలా పదేళ్లపాటు బందగీ చేసిన పోరాటం.. ఈ ప్రాంతంలో ఎంతో మందికి ధైర్యానిచ్చింది. కానీ బందగీపై కోపం పెంచుకున్న విస్నూరు దొర.. కోర్టు తీర్పు వచ్చిన ఆనందంతో ఉన్న బందగీ ఒక్కడే సూర్యాపేటకు వెళ్లే సమయంలో అతడి అన్న అబ్బాస్‌అలీని రెచ్చగొట్టి దాడి చేయించి తల నరికారు. అలా బందగీ ధైర్య సాహసాలను మరిచిపోలేని ప్రజలు కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద బందగీ సమాధి కట్టారు. బందగీ స్ఫూర్తిని ఎంచుకొని 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు యోధులు భారీగా తరలొచ్చారు. ఎక్కడ నలుగురు కలిసినా బందగీ ఉదంతమే చర్చకొచ్చేది.


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారక భవనం


గూడూరులో వినాయక నిమజ్జనంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం


కొత్తగూడ మండల కేంద్రంలో వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్సై కుశకుమార్


పెద్దవంగర మండలం చిన్నవంగరలో వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న యువత


మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న పద్మశాలీలు

గంగమ్మ ఒడికి గణనాథుడు

- మానుకోట నిజాం చెరువులో విగ్రహాల నిమజ్జనం
- ఆహ్వాన వేదిక వద్ద గణనాథులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు
- జిల్లా కేంద్రంలో శోభాయమానంగా విగ్రహాల ఊరేగింపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొమ్మిదిరోజులు పూజలందుకున్న గణనాథులను స్థానిక నిజాం చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని పురవీధుల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను ఉంచి యువకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు, కోలాటాలు చేస్తూ ఆనందోత్సవాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

స్వాగతవేదిక వద్ద ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు

జిల్లా కేంద్రంలో ఫారెస్టు సెంటర్‌లో మునిసిపల్ పాలకమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి వినాయక విగ్రహాలను నిజాం చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అలివేలు, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, విద్యుత్ శాఖ విజయ్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు చిట్యాల జనార్దన్, ఎడ్ల వేణుమాధవ్, దండెబోయిన వెంకన్న, పోతురాజు రాజు, తాళ్లపల్లి జగన్, కోడి శ్రీను, భూక్య శ్రీను పాల్గొన్నారు. నిజాం చెరువు వద్ద రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్యఆరోగ్య శాఖ, మునిసిపల్ అధికారులు నిమజ్జనాన్ని పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీగా చేసేందుకు కృషి : ఎమ్మెల్యే

మహబూబాబాద్ మునిసిపాలిటీని ప్లాసిక్ రహిత మునిసిపాలిటీగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.... ఎంతో భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులు పూజలు చేసిన భక్తులు, ఆనందోత్సవాల నడుమ నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. విద్యుత్ లైట్లను సైతం ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు. నిజాం చెరువు వద్ద చేపడుతున్న వినాయక నిమజ్జనాన్ని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ పర్యవేక్షించారు. నిజాం చెరువు వద్దకు విగ్రహాలు చేరుకోగానే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పడవలు, క్రేన్‌ల సాయంతో మునిసిపల్ సిబ్బంది వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

అత్యధికంగా లడ్డు వేలం రూ. 91,116

జిల్లా కేంద్రంలో వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డులకు వేలం పాట నిర్వహించగా భక్తులు వాటిని దక్కించుకున్నారు. ఇందులో న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద వేలంపాటలో లడ్డును అత్యధికంగా రూ. 91,116 లకు వేల్పుల వెంకటేశ్వర్లు-కనకదార దంపతులు దక్కించుకున్నారు. అదే విధంగా పట్టు వస్త్రాలు రూ. 42,116లకు కోదండరాములు-హారిక దంపతులు దక్కించుకున్నారు. బీసీ కాలనీ 9వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డువేలం పాటలో కందుకూరి శశిధర్ రూ. 72,116లకు దక్కించుకున్నారు.

భక్తులకు తీర్థప్రసాదాలు, తాగునీరు పంపిణీ

మహబూబాబాద్ పట్టణంలోని 27వ వార్డు బెస్తబజారులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులకు ప్రసాదం, తాగునీరును బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు యాప సీతయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, ఎల్తి మల్లయ్యగౌడ్, చుక్కల నరేష్, బుగ్గి రవి, చెవిటి ఐలయ్య, కందుకూరి భరత్, మల్లం యశ్వంత్, గణేష్, శ్రావణ్, ప్రవీణ్, తరుణ్ పాల్గొన్నారు.

- కురవి: కురవిలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని కురవి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం కురవిలో ఏర్పాటు చేసిన 18 విగ్రహాలను యువత డప్పు చప్పుల్లు, నృత్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు. కురవి మండలంలో ఏర్పాటు చేసిన 103 విగ్రహాలను ఆయా గ్రామాల చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ కురవి ఎస్సై గండ్రాతి సతీష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- మరిపెడ: మరిపెడ మునిసిపల్ కేంద్రంలో రామాలయం, పద్మశాలీ సంఘం, హన్మన్‌యూత్, కార్గిల్ సెంటర్‌లో భక్తమండళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను డప్పుచప్పుళ్ల కోలాట నృత్యాలతో ఊరేగించి మరిపెడ మాకుల చెరువులో నిమజ్జనం చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరకుమారి, మునిసిపల్ అధికారులు, పోలీసులు నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మరిపెడ రామాలయంలోని వినాయక లడ్డును రూ.55,116కు వేలం ద్వారా గర్రెపల్లి కాంతారావు-లక్ష్మీకవిత దంపతులు దక్కించుకున్నారు.ఈద్గాబజారు కాలనీ వినాయక లడ్డును బోడాశ్రీను-మౌనిక దంపతులు రూ.22,116కు దక్కించుకున్నారు.


మహబూబాబాద్ హౌజింగ్ బోర్డులో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

- మరిపెడరూరల్ : మరిపెడ మండలం తానంచెర్లలో మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండెపుడి, రాంపురం, ఎల్లంపేటతో పాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో రామడుగు అచ్యుత్‌రావు, దిగజర్ల శ్వేతముఖేష్, శ్రీను పాల్గొన్నారు.
- దంతాలపల్లి: మండల కేంద్రంతో పాటు దాట్ల, పెద్దముప్పారం, బీరిశెట్టిగూడెం గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ శివార్లలోని చెరువులు, కుంటల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్‌గౌడ్, వెంకన్న, భద్రునాయక్, సోమన్న, బుంగనాయక్, చిట్టినాయక్ తదితరులు పాల్గొన్నారు.
- నర్సింహులపేట: మండల కేంద్రంతో పాటు పెద్దనాగారం, కొమ్ముల వంచ, పడమటిగూడెం, బొజ్జన్నపేట, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, ముంగిమడుగు గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండ ఎస్సై ఎం.సురేష్, తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షించారు.
- పెద్దవంగర: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని విగ్రహాలను ఆయా గ్రామాల శివారు చెరువుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.
- తొర్రూరు: మండలంలోని హరిపిరాల, పత్తేపురం, అమ్మాపురం, వెలికట్టే, సోమారంతో పాటు పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నరసింహరావు, ఎంపీవో పూర్ణచందర్, ఎస్సై జి.ఉపేందర్ ఏర్పాట్లు చేశారు.
- గార్ల: మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను స్థానిక పాకాల ఏటిలో నిమజ్జనం చేశారు.
- కొత్తగూడ, గంగారం:కొత్తగూడ, గంగారం మండలాల్లో వినాయక నిమజ్జన వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడలో ఎస్సై కుశకుమార్ గణపతికి ప్రత్యేక పూజలు జరిపి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రణధీర్, మాజీ వైస్ ఎంపీపీ పూల యాదగిరి, మాజీ ఎంపీటీసీ సాలుకి సురేష్, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.
- నెల్లికుదురు: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లో చెరువులు, ఆకేరు వాగుల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- గూడూరు: మండల కేంద్రం అరవింద విద్యాలయం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పింగిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి పాకాల వాగులో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గ్రామ శివార్లలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. సీఐ బాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డిలు బందోబస్తు నిర్వహించారు.
- బయ్యారం: మండల కేంద్రంలో రామాలయం, గాంధీసెంటర్, కోటి సెంటర్‌తో పాటుజగ్గుతండతో పాటు వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- సీరోలు: పోలీస్ స్టేషన్ పరిధిలో 100 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా సోమవారం 69 విగ్రహాలను ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.
- కేసముద్రం: కేసముద్రం స్టేషన్ ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్, ఆర్యవైశ్యభవన్‌లోని శ్రీవరసిద్ధి వినాయక గణేష్ విగ్రహాలను స్థానిక పెద్దాయి చెరువులో సోమవారం నిమజ్జనం చేశారు. ఎస్ఐ మురళీధర్‌రాజ్ ఆధ్వర్యంలో నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయించారు.
- తొర్రూరు: మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు.


గార్ల పాకాల వాగులో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం


మహబూబాబాద్‌లో నిమజ్జనం చేసేందుకు వాహనంలో తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం


డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం


తొర్రూరులో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి


కేసముద్రంలో ఆదిదేవ వినాయకుని ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లాకేంద్రం శివారు ఈదులపూసపల్లిలోని హజరత్ సయ్యద్ ఇమాంషావలి దర్గాలో ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫాతిహాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లి షేక్. అన్వర్ తాజి నిజామీ, చాంద్‌పాషా, ఎండి. హరున్, సుభహాన్, రహమాన్, ఖాదిరి, షేక్, వలి, అమీద్, ముక్తార్, అజిత్, సాదిక్, ఫయాజ్ పాల్గొన్నారు.


ఈదులపూసపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- బేతోలులో మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ముస్లింలు పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్. యూసుఫ్, మౌలాన, ఆబిద్, రషీద్, షేక్.ఖాదర్‌బాబా, షేక్. జావిద్, షేక్. షరీఫ్, షేక్.రహీమ్, ఇమ్రాన్, అజీఫ్, జాని, షేకీమామ్, అఫీద్, షబీర్ పాల్గొన్నారు.
- డోర్నకల్: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో మస్జీద్ ఈ ఉస్మానియాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం డోర్నకల్ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేషిమామ్ సుల్తాన్, ఇబ్రహీం, రజాఆలీ, గౌస్, ఫరీద్, నవాబ్, మున్నా, సర్వర్, అఖిలుల్లా, ముస్లింలు పాల్గొన్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

గూడూరు, సెప్టెంబరు 16: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆపార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు మండల కేంద్రంలో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించారన్నారు. బూర్జువా పార్టీలు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, కటకం బుచ్చిరామయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

మరిపెడ, సెప్టెంబరు 16 : తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఆ పార్టీ 76వ వార్షికోత్సవాన్ని నిర్వహించగా సుధాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంతోనే నిజాం నవాబులు హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి అబ్దుల్ రషీద్, నాయకులు రాసాల వీరేందర్, రాములు, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోరాట మోధుల త్యాగాలను మరువలేం

గార్ల: వెట్టి చాకిరీ, బానిసత్వం, నిజాం నిరంకుశత్వంపై ఎదురొడ్డి పోరాటం సాగించిన తెలంగాణ సాయుధ పోరాటమోధుల త్యాగాలను నేటికి మరువలేమని సీపీఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం మంగపతిరావు భవనంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో కందునూరి శ్రీనివాస్, కందునూరి కవిత, భూక్యా హరినాయక్, ఈశ్వరలింగం, జి.రాజారావు,వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, వీరస్వామి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా...

పెద్దవంగర, సెప్టెంబర్ 16 : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిట్యాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మొగులగాని రజనీకాంత్ తండ్రి మొగులగాని వెంకట సోములు(65), నీటిసంపులో పడి మృతి చెందిన మన్విత్‌శకుంతల్(5) మరణించగా మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ పరామర్శలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, రంగు మురళిగౌడ్, పన్నీరు వేణు, దాసరి శ్రీనివాస్, సీతారామ్‌నాయక్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వివాహితపై అత్యాచారం

- ఇద్దరు యువకులపై కేసు
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన..
- ఆలస్యంగా వెలుగులోకి..

కేసముద్రం, సెప్టెంబబరు 16 : ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మతిస్థిమితంలేని వివాహితపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి వివరాలివీ.

కేసముద్రం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితంలేని వివాహిత(40) శనివారం ఆమె భర్త, ఇతర కుటుంబసభ్యులు తమ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన క్రమంలో ఒంటరిగా ఉంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సుమారు 20ఏళ్ల వయసుండే ఇద్దరు యువకులు ఆమె ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డారు. చివరకు ఆదివారం ఈ విషయం కుటుంబసభ్యుల్లో ఒకరికి తెలవగా పలు ఆధారాలతో పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వివాహితపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసుకున్నామని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

అనారోగ్యంతో యువతి మృతి

కొత్తగూడ, సెప్టెంబరు 16 : అనారోగ్యంతో చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన హరిదాస్యం రమేష్, సునీత దంపతుల కుమార్తె వైష్ణవి(24) గత కొన్ని రోజులుగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైష్ణవి సోమవారం మృతిచెందినట్టు మృతురాలి బంధువులు తెలిపారు.

వెల్లువిరిసిన మత సామరస్యం..

మహ్మద్ ప్రవక్త జయంతి రోజున వినాయక మండపం వద్ద స్వీట్ల పంపిణీ


వినాయకమండపం వద్ద మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఫరీద్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మత సామరస్యం వెల్లు విరిసింది. ముస్లింల పండుగ ఈద్ మిలాదున్ నబి రోజున సోమవారం వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని గణేష్ మండపం వద్ద పట్టణానికి చెందిన వార్డు కౌన్సిలర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్ మిఠాయిలు పంపిణీ చేసి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ.. శాంతికాముకుడు, మానవులతో పాటు సకల జీవులను ప్రేమించాలని, పేదరికంలో ఉన్న వారికి తోచిన సహాయం అందించాలని చెప్పిన మహ్మద్ ప్రవక్త బోధనలను ఆచరించి ఆయన అడుగు జాడల్లో నడుస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రవక్త బోధనలకనుగుణంగా మతసామరాస్యాన్ని, శాంతి ప్రేమను చాటుతూ గణేష్ మండపం వద్ద మిఠాయిలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ గౌస్, రఫిక్, జమీర్, గయాజ్, ఫయాజ్, మోహసిన్, సమీర్, సయిద్ పాల్గొన్నారు.

గణపతి లడ్డు డ్రా..

వచ్చిన డబ్బులు బాధితులకు అందజేత


కోమట్లగూడెంలో రంజిత్‌ను సన్మానిస్తున్న ఎస్సై రవికుమార్

గంగారం (కొత్తగూడ), సెప్టెంబరు 16: గంగారం మండలం కోమట్లగూడెంలోని కోదండ రామాలయంలో సోమవారం గణపతి లడ్డు డ్రా నిర్వహించగా వచ్చిన డబ్బులను బాధిత కుటుంబాలకు కోదండ రామాలయం కమిటీ వారు అందజేశారు. కమిటీ సభ్యులను ఎస్సై రవికుమార్ అభినందించారు. కోమట్ల గూడెంలోని కోదండ రామాలయంలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద అలంకరించిన లడ్డు డ్రా నిర్వహించారు. డ్రాలో తాళ్ల రంజిత్ గణపతి లడ్డును సొంతం చేసుకున్నారు. లడ్డు లక్కీ డ్రాలో రూ. 30,300 వచ్చాయి. వచ్చిన డబ్బులను ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన నష్టపోయిన బాధితులు సారయ్యకు రూ. 10వేలు, భిక్షంనకు రూ. 5వేలు, బాలక్కకు రూ. 5వేలు ఇచ్చారు. కొత్తగూడ మండలం గాంధీనగర్‌లో డెంగ్యూతో మృతిచెందిన మల్లెల విజయ్ కుటుంబానికి రూ.10వేలు అందజేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి లడ్డు డ్రా ద్వారా వచ్చిన డబ్బులు బాధితు లకు అందజేసిన కొదండ రామాలయం కమిటీ చైర్మన్ సైప సురేష్, వైస్ చైర్మన్ ప్రతాపని శ్రీకాంత్, కమిటీ సభ్యులను ఎస్సై రవికుమార్ అభినందించారు.

బస్ డ్రైవర్, కండక్టర్‌లకు గ్రామస్థుల సన్మానం


డ్రైవర్, కండక్టర్‌లను సన్మానిస్తున్న గ్రామస్థులు

కొత్తగూడ, సెప్టెంబరు 16 : బస్ సర్వీస్‌ను సమయపాలన పాటిస్తూ నడుపుతూ.. గ్రామస్తులతో మమేకమై కుటుంబసభ్యుల వలె ఉంటూ ఉత్తమ సేవలందిస్తున్న బస్ డ్రైవర్, కండక్టర్‌లను మండలంలోని దుర్గారం గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. నర్సంపేట డిపో బస్ డ్రైవర్ శ్రీనివాస్, కండక్టర్ శ్రీనివాస్‌ను శాలువాలు కప్పి గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మట్టపల్లి రామారావు, పత్తిపాక సరస్వతి, మట్టపల్లి బానమ్మ, ఆరపెల్లి రేణుక పాల్గొన్నారు.